## క్లుప్తంగా

### వినాయక చవితి శుభాకాంక్షలు

చీరాల: తొలి పూజలందుకుని, విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుని ఆశీస్సులు తెలుగు రాష్ట్రాల ప్రజలు, నియోజకవర్గ ప్రజలందరికి ఉండాలని కోరుకుంటూ వినాయక చవితి శుభాకాంక్షలను మాజీ ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి కరణం వెంకటేష్‌లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏకదంతుడి కృపతో రాష్ట్ర ప్రజలు, నియోజకవర్గ ప్రజల జీవితాలలో సుఖసంతోషాలు నిండాలని, ఆనందోత్సాహాలతో పండుగను జరుపుకోవాలన్నారు.

### 10న పర్చూరులో జాబ్ మేళా

పర్చూరు (చినగంజాం): పర్చూరులోని బీపీఆర్ జూనియర్ కళాశాలలో ఈ నెల 10వ తేదీ ఉదయం 9 గంటలకు జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి తమ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయం వారి సంయుక్త ఆధ్వర్యంలో జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో గోదావరి కో ఆపరేటివ్ సొసైటీ, కృష్ణపట్నం పోర్ట్, రాయల్ మెరైన్, రిలయన్స్ ట్రెండ్స్, కళ్లం టెక్స్‌టైల్స్ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. ఈ సంస్థల్లో 120కి పైగా ఖాళీలు ఉన్నాయని విద్యార్హతలు, నైపుణ్యాన్ని బట్టి జీతం నెలకు రూ.10 వేలు నుంచి రూ.20 వేల వరకు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈమేళాకు ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, డిప్లొమా, బీఎస్సీ (కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), ఎంబీఏ, పీజీ చదివిన వారు అర్హులు అని తెలిపారు. వయసు 18 నుంచి 35 సంవత్సరాలు మధ్య ఉండాలన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులు తమ పూర్తి బయోడేటా, సర్టిఫికెట్‌లతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు వెబ్ పోర్టల్ ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 63027 64962, 79814 43777 నంబర్లను సంప్రదించాలని కోరారు.

### సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం

చీరాల: విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం చీరాల రూరల్ మండలం పాపాయిపాలేనికి చెందిన పులి వెంకటేశ్వర్లు రూ.1 లక్ష, కారుసాల శైలజ రూ.50 వేలను సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం అందించారు. విరాళాల చెక్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు అందించారు. వరద బాధితులను ఆదుకునేందుకు విరాళం ఇచ్చిన వారిని ఎమ్మెల్యే అభినందించారు.

### తుఫాన్ బాధితుల కోసం విద్యార్థుల విరాళం

మార్టూరు: తుఫాను తీవ్రత వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితుల కోసం మండలంలోని ద్రోణాదుల గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం తమ వంతు సాయం అందించారు. పాఠశాల బాలబాలికలు అందరూ కలిసి రూ.2886 వసూలు చేసుకుని ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపినట్లు ఉపాధ్యాయులు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను గ్రామస్తులు అభినందించారు.

### రూ. 2.71 లక్షల నగదు స్వాధీనం

అద్దంకి రూరల్: అద్దంకి పట్టణంలో గుట్టుచప్పుడు కాకుండా కొంతకాలంగా పేకాట ఆడుతున్న 10 మందిని సీఐ కృష్ణయ్య శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. సీఐ వివరాల మేరకు.. అద్దంకి పట్టణం, అభ్యుదయ నగర్ కాలవకట్ట వద్ద రేకుల షెడ్డులోని పేకాట శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు స్థానికులు ఇచ్చిన సమాచారంతో సీఐ సిబ్బందితో శిబిరంపై దాడిచేసి పేకాట రాయుళ్లను, వారి వద్ద ఉన్న నగదు రూ.2,71,500 సీఐ స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు.

### పోలీసుల అనుమతులు తప్పనిసరి



మేదరమెట్ల: వినాయక చవితి మండప నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని అద్దంకి రూరల్ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. వినాయక చవితిని పురస్కరించుకొని మేదరమెట్ల, కొరిశపాడు, జే.పంగులూరు పోలీసు స్టేషన్ల పరిధిలోగల గ్రామాల్లో వినాయక విగ్రహాల నిర్వాహకులకు శుక్రవారం సీఐ శుక్రవారం సలహాలు, సూచనలు అందించారు. మండపాలు పెట్టువారు తప్పనిసరిగా కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి రోజూ కమిటీ సభ్యులు మండపం వద్దనే అందుబాటులో ఉండాలన్నారు. మండపం ఎన్ని రోజులు పెట్టుకుంటారు, తరువాత ఏ ప్రదేశంలో నిమజ్జనం చేయడం జరుగుతుందనే వివరాలను ముందుగానే పోలీసులకు తెలియజేయాలన్నారు. తల్లిదండ్రులు నిమజ్జన సమయంలో చిన్నపిల్లలను తీసుకుపోవడం మంచిది కాదని, వారిని ఊరేగింపులో పాల్గొనకుండా చూడాలన్నారు. ఊరేగింపుల్లో అశ్లీలతలకు తావు లేకుండా కమిటీ సభ్యులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వేటపాలెం: ప్రజలు వినాయక చవితి పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చీరాల డీఎస్పీ పి జగదీష్ నాయక్ సూచించారు. దేశాయిపేట కళ్యాణ మండపంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశం వినాయక చవితి సందర్భంగా ప్రజలకు తీసు పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు. పోలీస్ శాఖ సూచించిన ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# వసతి.. చెప్పుకోలేని దుస్థితి

- గిరిజన విద్యార్థులకు వసతి అధ్వానం
- ఆవేదనలో పేద విద్యార్థులు
- బోగస్ రోల్‌తో నిర్వహణ
- అద్దె భవనాల్లో కొన్ని హాస్టల్స్
- జ్వరాల బారిన పడుతున్న విద్యార్థులు

చీరాల/వేటపాలెం: గ్రామీణ పేద గిరిజన విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం రాష్ట్ర గిరిజన సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల్లో ఏర్పాటు చేసింది. అందులో గిరిజన విద్యార్థులకు విద్యతో పాటు వసతి సౌకర్యం కల్పించింది. అయితే ఈ గురుకుల పాఠశాల్లో వసతి, విద్యా బోధన సరిగా లేక పోవడంతో విద్యార్థులు చేరడం మానేశారు. దీంతో ఉపాధ్యాయులు వారి ఉద్యోగాల నిల బెట్టుకోవడానికి బోగస్ రోల్‌ను రికార్డులో పేర్లు నమోదు చేసి ఉన్నత అధికారులకు చూపిస్తున్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణంలో రాష్ట్ర గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల నిర్వహిస్తున్నారు. అయితే విద్యార్థులకు తరగతి గదుల్లోని అరకొర వసతులతో బోధన కొనసాగిస్తున్నారు. వసతికి ప్రత్యేక గదులు లేక పోవడంతో తరగతి గదులనే వసతి గృహాలుగా ఉపయోగిస్తున్నారు. పగటి పూట తరగతులు నిర్వహించి.. రాత్రి పూట అక్కడే వసతి ఏర్పాటు చేస్తున్నారు. విద్యార్థుల పెట్టెలు గోడ పక్కన పెట్టి అక్కడే క్లాసులు చెబుతున్నారు. ఇక్కడ ఒకే హాల్లో రెండు తరగతులు నిర్వహిస్తున్నారు. కానీ గురుకుల పాఠశాల్లో బోధనపై తల్లిదండ్రులు కూడా సంతృప్తిగా లేక పోవడంతో బోగస్ రోల్ నమోదు చేస్తున్నారు. రికార్డుల్లో 6 నుంచి 9వ తరగతి వరకు 67 మంది విద్యార్థులున్నట్లు నమోదు చేశారు. మధ్యాహ్న భోజనం కూడా బోగస్ రోల్‌తోనే నడుస్తోంది. చీరాల పట్టణంలోని సంక్షేమ హాస్టల్స్‌లో మెస్ చార్జీలు, అద్దెలు పెండింగ్‌లో ఉన్నాయి. పట్టణంలో ఎస్సీ బాలికల హాస్టల్ మాత్రమే ప్రభుత్వ భవనంలో నడుపుతున్నారు. అలానే ఏపీ మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కొంత మంది విద్యార్థులు జ్వరాల బారిన పడ్డారు. దీంతో తల్లిదండ్రులకు సమాచారం అందించి ఇంటికి పంపించి వేశారు. కేజీబీవీలో సమస్యలు తెలుసుకునేందుకు వెళ్లగా మీడియాకు అనుమతి లేదంటూ సిబ్బంది లోపలికి రానివ్వలేదు.

మార్టూరు: వలపర్లలోని ప్రభుత్వ బాలుర వసతిగృహం 1983లో ఏర్పాటు చేయగా..



వేటపాలెంలోని గురుకుల పాఠశాలలో తరగతి గదే పడక గదిగా..

ప్రస్తుతం ఇక్కడ మూడో తరగతి నుంచి పదో తరగతి వరకు చదివే 45 మంది విద్యార్థులు వసతి గృహంలో ఉంటున్నారు. విద్యార్థులు నిద్రించే గదుల పై కప్పు పెచ్చులూడి ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితి నెలకొంది. హాస్టళ్ల నీటి సౌకర్యం కోసం బోరు.. మోటారు సౌకర్యం కల్పించారు. అయితే కొంచెం దూరంలో వాటర్ ట్యాంక్ ఉంది. నీటి సరఫరా తగినంతగా లేకపోవడంతో విద్యార్థులు ఉపయోగించే మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థుల తాగునీటి కోసం స్థానిక వాటర్ ప్లాంట్ నుంచి నీరు కొనుగోలు చేస్తున్నట్లు వార్డెన్ నెహేమియా తెలిపారు.



వలపర్ల: సరిపడా నీటి సౌకర్యం లేక అధ్వానంగా ఉన్న మరుగుదొడ్లు



వలపర్ల ప్రభుత్వ బాలుర వసతి గృహంలో సీలింగ్ కప్పు పెచ్చులూడి అధ్వానంగా ఉన్న పరిస్థితి

మోటార్ నుంచి వాటర్ ట్యాంకు కు నీటిని సరఫరా చేసే పైపులైను చాలా కాలం నుంచి రిపేరులో ఉండటంతో నీటి సమస్య తలెత్తుతోంది.

**అద్దంకి నియోజకవర్గంలో దారుణం..**

అద్దంకి: స్థానిక బీసీ బాలుర వసతి గృహంలో 37 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే ఇందులో ముగ్గురు జ్వరాల బారిన పడి ఇంటికి వెళ్లారు. మధ్యాహ్నం భోజనం పాఠశాలలో తింటున్నారు. కిటికీల డోర్లు పడకపోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. అలాగే స్థానిక బాలికల ఎస్సీ హాస్టల్, ఎస్సీ, ఎస్టీ బాయ్స్ హాస్టల్, గురుకుల బాలిక వసతి గృహాల్లో సుమారు 150 మంది విద్యనభ్యసిస్తున్నారు.





చీరాలలోని కేజీబీవీలో మీడియాకు అనుమతి లేదంటూ గేట్లు వేసిన దృశ్యం



అద్దంకి బీసీ హాస్టల్లో వసతి గది ఇలా..



అద్దంకి బీసీ హాస్టల్లో మరుగుదొడ్లు ఇలా..

# మట్టి గణపతి ప్రతిమలతో పర్యావరణ రక్షణ



పందిళ్లపల్లిలో విద్యార్థులకు మట్టి విగ్రహాలు చూపుతున్న విద్యార్థులు



అద్దంకిలో వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు



మున్నంవారిపాలెంలో విద్యార్థులకు అందజేస్తున్న ఉపాధ్యాయుడు

చీరాల/వేటపాలెం: మట్టి గణపతి ప్రతిమలతో పర్యావరణ రక్షణ సాధ్యమవుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. శుక్రవారం చీరాల పట్టణంలోని కొట్లబజారులో ఓగేటి శ్రీనివాసశాస్త్రి సౌజన్యంతో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఒన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రతిమలు అందించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలన్ని వాడవద్దని, మట్టి వినాయక ప్రతిమలను వినియోగించాలన్నారు. 500 మందికి మట్టి వినాయక ప్రతిమలను అందించారు. అలానే వినాయక మండపాలు ఏర్పాటు చేసేవారు పూర్తి వివరాలను పోలీసులకు అందించాలన్నారు. మండపాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మహాగణపతి యూత్ విశ్వనాథ శాస్త్రి, సిద్ధునాథ శాస్త్రి, సాయి, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

✦ వేటపాలెం రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో వినాయక చవితి పండుగను పురస్కరించుకొని 500 మట్టి గణపతి విగ్రహాలను క్లబ్ సభ్యులు పంపిణీ చేశారు. పందిళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఆర్ దశరథరామిరెడ్డి మట్టి వినాయకుని ప్రతిమలు విద్యార్థులకు పంపిణీ చేశారు.

**స్వచ్ఛంద సంస్థల మట్టి విగ్రహాల పంపిణీ..**

అద్దంకి/అద్దంకి రూరల్: మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణ పరిరక్షణ జరుగుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు వీరయ్య అన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో 200 మట్టి వినాయక విగ్రహాలను, కార్యాలయం వద్ద మరో 300 విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, కార్యదర్శి చుండూరి మురళీ సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, అసిస్టెంట్ గవర్నర్ షేక్ మహమ్మద్ రఫీ, అశహరి హరిప్రసాద్, కొల్లా భువనేశ్వరి, పుట్టంరాజు శ్రీరామచంద్ర మూర్తి, పీ ఆంజనేయులు, కొల్లిపర నాగయ్య, గురుశేఖర్, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**2 వేల మట్టి వినాయక విగ్రహాల పంపిణీ..**

చినగంజాం/మార్టూరు/యద్దనపూడి/కారంచేడు: వినాయక చవితిని పురస్కరించుకొని పర్చూరులోని వేణుగోపాలస్వామి ఆలయంలో గ్రామానికి చెందిన దాతలు కోట హరిబాబు, శ్రీనివాసరావులు ప్రజలకు 2 వేల మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రావువారి వెంకట శివప్రసాద్, వైస్ ఎంపీపీ కోట ప్రసన్న, న్యాయవాది ఒగ్గిశెట్టి గోవిందరాజులు, తులసి నాగమణి, సామ్రాజ్యం, కంచనపల్లి రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు. నూతలపాడు గ్రామంలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ రోటరీ సభ్యులతో కలిసి గ్రామస్తులకు 550 మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ చిన్నయ్య, క్లబ్ కార్యదర్శి కే ఆంజనేయులు, సభ్యులు ఎన్ శ్రీనివాసరావుస కొల్లా సుబ్బారావు, పాబోలు వెంకన్న, సదానందరెడ్డి, మున్నంగి వెంకట సుబ్బయ్య, భవనం రాజగోపాలరెడ్డి, ధూళిపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

✦ చినగంజాం మండలం మున్నంవారిపాలెం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం మల్లారెడ్డి ఆధ్వర్యంలో 'మట్టి వినాయకులను పూజిద్దాం-పర్యావరణాన్ని పరిరక్షిద్దాం'పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయుడు నాగమల్లేశ్వరరావు పిల్లలకు మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యస్ చంద్రశేఖర్, సీఆర్పీ చాట్ల సురేంద్ర పాల్గొన్నారు.

**వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..**

చీరాల రూరల్: వరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని వినాయక ప్రతిమలు నీటిలో కరిగే విధంగా మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. వినాయక చవితిని పురస్కరించుకుని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల ఉన్నత పాఠశాల వద్దగల మహాలక్ష్మి అమ్మవారి చెట్టు వద్ద 1300 మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీ రామకృష్ణ, సీ గురుప్రసాద్, సత్యనారాయణ, శ్రీనివాసరావు, సుధాకర్, వెంకటేశ్వర్లు, పాండురంగారావు, రమేష్, రవి, భాస్కరరావు, మారుతి, సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాలనూ వదలని అధికారులు

- వినాయక విగ్రహాల ఏర్పాటుకు మామూళ్ల బెడద
- మండపాల వద్ద రూ.3–5 వేల వరకు వసూలు చేస్తున్న పోలీసులు
- విస్మయం వ్యక్తం చేస్తున్న నిర్వాహకులు

యద్దనపూడి: లంచాలకు దేవుడు సైతం మినహాయింపు కాదని అధికారులు నిరూపించారు. ఎలాంటి విఘ్నాలు కలగకుండా ఉండాలని విఘ్నాధిపతిని పూజిస్తాం. అలాంటి పండుగకు అధికారులు అనుమతుల రూపంలో విఘ్నాలు కలిగిస్తూనే ఉన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు జరగాలంటే అక్కడక్కడ మామూళ్లు ఇవ్వనిదే పనిజరగదు. అయితే దేవుడి కార్యాలకు సైతం మామూళ్లు ఇవ్వాల్సి రావటంతో ప్రజలు కంగుతింటున్నారు. నవరాత్రి ఉత్సవాల అనుమతులకు పైసలిస్తేనే అనుమతులు అన్న ధోరణిలో ఆయా శాఖల అధికారులు తెర తీశారు. ఈ సంవత్సరం ప్రభుత్వం సింగిల్‌విండో విధానం ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పిన అధికారులు అందుకు సంబంధించిన విధి విధానాలను పూర్తిస్థాయిలో అమలు చేయకపోవటం గమనార్హం. వాట్సప్ ద్వారా హాయ్ అని సంబంధిత వివరాలన్ని మొబైల్‌ఫోన్‌కు వస్తుందని తద్వారా విద్యుత్, అగ్నిమాపక, పోలీస్‌శాఖ బృందం మండపాలు ఏర్పాటు చేసే ప్రదేశానికి వచ్చి పరిశీలించి ఎంత రుసుము చెల్లించాలో అన్న వివరాలు తెలియజేస్తారని ప్రకటనలో తెలిపారు. కానీ వాస్తవ పరిస్థితులు అందుకు విరుద్ధంగా సాగుతున్నాయి.

**ఫీజు తక్కువ బాదుడు ఎక్కువ..**

వినాయకచవితి మండపాలు ఏర్పాటు చేసుకునేందుకు ఊరేగింపు, డీజే, మైకులు, లైటింగ్ తదితర అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. ఈ అనుమతుల కోసం మైకు కోసం రూ.100, ఊరేగింపు కోసం రూ.250 చొప్పున చెల్లించాలి. అలాగే విద్యుత్‌శాఖకు వెయ్యి ఓల్టుల విద్యుత్ వాడకానికి రూ.2250 చెల్లించాలి. కానీ వాస్తవానికి ఈ అనుమతుల పేరిట ఒక్కో విగ్రహం వద్ద ఆయా శాఖల అధికారులు అనుమతుల పేరిట నిర్వాహకుల నుంచి ముక్కు పిండి మాముళ్ల వసూలు చేస్తున్నారు. పోలీసు శాఖ ఒక్కో పందిరికి సరాసరి రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఊరేగింపుకు మాత్రం విగ్రహం వద్ద హడావుడిని బట్టి నిర్వాహకులు ఖర్చు చేసేదానిని బట్టి మరో రూ. 5 వేల వరకు వసూలు చేస్తున్నారనేది బహిరంగ సత్యం.

**లక్షల్లో దోపిడీ..**

నియోజకవర్గంలో 100 గ్రామాలకు పైగా ఉండగా ఒక్కొక్క గ్రామంలో సరాసరి మూడు విగ్రహాలు ఏర్పాటు చేసినా ఇలా ఒక్కో పందిరి వద్ద రూ.3 వేల చొప్పున మాముళ్ల రూపంలో వసూలు చేసినా రూ.9 లక్షల వరకు దోపిడికి అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దేవుడి పండుగలకు సైతం ఇలా మాముళ్లు చెల్లించాల్సి రావటంతో నిర్వాహకులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు సైతం ఇలాంటివి మంచివి కాదంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## గణపతిస్వామికి బంగారు కిరీటం బహూకరణ



పగడాల హారం అందిస్తున్న దాతలు



బంగారు కిరీటం అలంకరణలో అభయ గణపతి

చీరాల అర్బన్: పట్టణంలోని అమరావారివీధిలో వేంచేసియున్న అభయ గణపతిస్వామి వారి 66వ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారికి నూతన బంగారు కిరీటాన్ని అలంకరించారు. బంగారు కిరీటానికి అభిషేకాలు, అర్చనలు నిర్వహించి స్వామివారికి అలంకరించారు. దాతల సాయంతో బంగారు కిరీటాన్ని అత్యంత వైభవంగా ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కనక నాగవరపమ్మకి బంగారు పగడాల హారం..**

వేటపాలెం: రామన్నపేట శివారులో పంట పొలాల్లో వేంచేసియున్న కనక నాగవరపమ్మ అమ్మవారికి దాతలు బంగారపు పగడాల హారం వితరణగా అందజేసినట్లు ఈఓ శ్రీనివాసరావు శుక్రవారం తెలిపారు. దాతలు గుడ్లూరు మండలం చిన్నపావని గ్రామానికి చెందిన వేళ్ల శ్రీనివాసులు దంపతులు రూ. 40 వేలు విలువగా బంగారంతో తయారు చేసిన పగడాల హారం అమ్మవారికి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో దాతల కుంటుంబ సభ్యులు వేళ్ల వెంకట శివరామకృష్ణ ప్రసాద్, షీలారాణి, వేళ్ల రాకేష్‌కుమార్, నవిత, ప్రశీద, వైష్ణవి, త్రినయిని, లక్ష్మీ,ఆలయ మాజీ కమిటీ సభ్యులు బండ్లబాబు, ఏ భానుమూర్తి, యారాసు అరుణ్‌బాబు పాల్గొన్నారు.

## తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు

కారంచేడు: తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు ఉండే ఆహారాన్ని ఇంటి వద్దనే ఎలా సిద్ధం చేసుకోవచ్చో ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు సీడీపీఓ తిరుమలశెట్టి ఝాన్సీ చేసి చూపించారు. శుక్రవారం ఆమె మండల కేంద్రమైన కారంచేడు ముస్లీ బజారులోని ఉర్దూ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార మాసోత్సవాల్లో పాల్గొని గర్భిణులు, బాలింతలు, స్త్రీలు తీసుకోవాల్సిన ఆహార నియమాలను ఆమె వివరించారు. మంచి పౌష్టికాహారం తీసుకున్న స్త్రీలకు, పౌష్టికాహార లోపంతో ఉన్న స్త్రీలకు మధ్యన ఉన్న వ్యత్యాసాన్ని ఆమె వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే మంచి పోషకాలు ఉన్న ఆహారం తప్పకుండా తీసుకోవాలన్నారు.

చీరాల అర్బన్: పౌష్టికాహారం తీసుకోవడం వలన తల్లులు ఆరోగ్యంగా ఉంటూ ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మనిస్తారని ఏ–1 సెక్టార్ సూపర్‌వైజర్ తబిత అన్నారు. శుక్రవారం చీరాల సచివాలయ పరిధిలోని శాంతినగర్, శృంగారపేట అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార మాసోత్సవ కార్యక్రమంపై అవగాహన కల్పించారు.

## వ్యవసాయానికి సాంకేతికతను జోడించాలి

జే.పంగులూరు: వ్యవసాయానికి సాంకేతికతను జోడించి విప్లవాత్మకమైన మార్పులు తీసుకురావచ్చని, తద్వారా రైతులు లాభాల బాట పట్టాలని మండల వ్యవసాయాధికారి కే సుబ్బారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలోని మినుము పంటకు శుక్రవారం డ్రోన్ సహాయంతో పిచికారీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోందన్నారు. దీని సహాయంతో విత్తనాలు చల్లుకోవడం నుంచి ఎరువులు, పురుగు మందులు వేయడం పంటల అంచనా, పంటలకు అందిచాల్సిన పోషకాలు అందించడంతో పాటు పలు అంశాల్లో టెక్నాలజీ ప్రయోజనకారిగా ఉంటుందన్నారు. మందుల పిచికారీ విషయంలో 5 కూలీలు చేసే పని ఈ ఒక్క డ్రోన్ చేస్తుందని తెలిపారు. సమయం 60 శాతం ఆదా అవుతోందని, నీరు మందు ఖర్చును, సమయాన్ని తగ్గించుకోవచ్చన్నారు. ముప్పవరం గ్రామంలోని వీఏఏ దిల్షా డ్రోన్ సహాయంతో వినుకొండ శ్రీను పొలాన్ని డ్రోన్ ద్వారా మినుము పంటకు పురుగు మందులు పిచికారీ చేశారు.